క్లుప్తంగా

సబ్సిడీపై ట్రాక్టరు అందజేత


ట్రాక్టరు అందజేసిన ఏవో సోమశేఖర్

కె. కోటపాడు: వైఎస్సార్ యంత్రా సేవా పథకంతో ప్రతి రైతుకు లబ్ధి చేకూరుతుందని ఆర్లె గ్రామ సచివాలయ కన్వీనర్ బోళెం దుర్గ అన్నారు. గ్రామానికి చెందిన బి. దుర్గకు సబ్సిడీపై ట్రాక్టరును ఏవో సోమశేఖర్ శనివారం అందజేశారు. సులభతర సాగు కోసం వ్యవసాయ యంత్ర పరికరాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోళెం సందీప్, మాజీ సర్పంచ్ బోళెం కృష్ణారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న సీఐ గణేష్

నర్సీపట్నం: విశాఖపట్నం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇండో–నేపాల్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించారు. శివాస్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న ఎస్.ప్రజ్వల్, ఎస్.గంగాధర్, ఎం.నందిత సత్తా చాటి పతకాలు సాధించారు. వీరిని పట్టణ సీఐ ఎస్.గణేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ వంగ సత్యనారాయణ, ఎస్సైలు గోవిందరావు, ధనుంజనాయుడు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో పారదర్శక సేవలు


వలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచ్ పైడితల్లమ్మ, కోటేశ్వరరావు

కె.కోటపాడు: వలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నట్లు సర్పంచ్ పైల పైడితల్లమ్మ తెలిపారు. రొంగలి నాయుడుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో పని చేస్తున్న ఉత్తమ వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారంతోపాటు రూ.10 వేల ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తోపాటు, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లని అభిప్రాయపడ్డారు. పంచాయతీ కార్యదర్శులు భీమరాజు, సునీత, వార్డు మాజీ మెంబర్లు దొగ్గ దేముడుబాబు, చల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీకి ఆరుగురు గైర్హాజరు


పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

రోలుగుంట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు కేంద్రంలో శనివారం రెండో రోజు హిందీ పరీక్ష నిర్వహించారు. 28 మంది విద్యార్థులకు గాను ఆరుగురు గైర్హాజరయ్యారు. వీరు ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు వీలుగా అవసరమైన బెంచీలు, ఫ్యాన్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు. చీఫ్‌గా ఇక్కడ హెచ్.ఎం. ఈరెల్లి అప్పారావు, డీవోగా బి.వి.రమణ వ్యవహరించారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్‌బాబు బదిలీ

నర్సీపట్నం: డివిజన్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబుకు విజయనగరం బదిలీ అయింది. ఆ స్థానంలో విశాఖ ప్రాజెక్టు కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న వి.డి.వి.రామకృష్ణ నియమితులయ్యారు. సురేష్‌బాబు ఇక్కడ మూడేళ్ల పాటు పని చేశారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో విద్యుత్ లైన్లు ఆధునికీకరించి అంతరాయం లేని విద్యుత్ సరఫరా, పట్టణంలో లోవోల్టేజీ సమస్య లేకుండా విశేషంగా కృషి చేశారు.

ఆస్పత్రులకు వెళ్లి పించన్ల పంపిణీ


రామారావుకు పింఛను అందజేస్తున్న వలంటీరు గణేష్


పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ జల్లి లక్ష్మి


రామ్మూర్తికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ సరోజిని

మాకవరపాలెం/నర్సీపట్నం/కె.కోటపాడు/మాడుగుల రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీరు వ్యవస్థ పింఛనుదారులకు భరోసాగా నిలుస్తోంది. అనారోగ్య సమస్యలతో ఎక్కడెక్కడో దూరాన వివిధ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నా, మేమున్నామంటూ.. అక్కడకు వెళ్లి మరీ పింఛన్ల సొమ్ము అందిస్తున్నారు. శనివారం పలువురు వలంటీర్లు పింఛన్లు అందించి శభాష్ అనిపించుకున్నారు. విశాఖలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాకవరపాలెం మండలం శెట్టిపాలెం సచివాలయం పరిధి దుంగలవానిపాలేనికి చెందిన పైల చిన్నమ్ములుకు వలంటీర్ వరలక్ష్మి పింఛను నగదు అందించింది. నర్సీపట్నం మున్సిపాలిటీ 12వ సచివాలయం పరిధిలోని 19వ వార్డు బలిఘట్టంకు చెందిన గవిరెడ్డి వరహాలమ్మకు విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వలంటీర్ జల్లి లక్ష్మి పింఛన్ సొమ్ము అందజేసింది. మాడుగుల మండలం కె.జె.పురానికి చెందిన బుద్దా రామారావుకు విశాఖ శీలానగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వలంటీరు సోమిరెడ్డి గణేష్ వృద్ధాప్య పింఛను అందజేశారు. ఇదే ఆస్పత్రిలో బి.శ్రీరామ్మూర్తికి కె.కోటపాడు మండలం కింతాడ గ్రామ వలంటీర్ బి.సరోజిని వృద్ధాప్య పింఛన్ అందజేసింది.

ప్రజా సంక్షేమమే సీఎం ధ్యేయం


సంక్షేమ లబ్ధి గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఏఎల్‌పురంలో మూడో రోజు శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఇందులో భాగంగా ఆయన శనివారం ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. అక్కడ ప్రజలకు అవసరమైన కమ్యూనిటీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎస్సీ, బీసీ కాలనీలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండుటెండలో సైతం మహిళలు పెద్ద ఎత్తున హాజరై తమ సాధకబాధకాలు చెప్పుకున్నారు. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల ఇబ్బందులు ఉన్నాయని వాపోయారు. వెంటనే డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాల పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయన్నారు. అర్హతే ప్రామాణికంగా వీటిని మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందుతాయన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, పార్టీ ఎస్సీ సెల్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ బుల్లిప్రసాద్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు


మాకవరపాలెం: జి.గంగవరంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రమేష్


మాడుగుల రూరల్: రామచంద్రపురంలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రభాకరరావు


నాతవరం: గుమ్మడిగొండలో సూచనలు చేస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మి

మాకవరపాలెం: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి రమేష్ సూచించారు. జి.గంగవరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. జగనన్న కాలనీని సందర్శించి ఇప్పటికీ ప్రారంభం కాని నిర్మాణాలను వెంటనే చేపట్టాలన్నారు. బిల్లులు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయన వెంట ఎంపీడీవో అరుణశ్రీ, హౌసింగ్ జేఈ రామలింగస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివారెడ్డి, వెలుగు ఏపీఎం చినబాబు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: రామచంద్రపురంలో జగనన్న లేఅవుట్‌ను మండల ప్రత్యేకాధికారి జి. ప్రభాకరరావు పరిశీలించారు. ఇక్కడ 34 గృహాలు, గదబూరు లేఅవుట్‌లో 9 ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఎంపీడీవో మీనాకుమారి, హౌసింగ్ ఏఈ లెక్కల సత్యనారాయణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భార్గవ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాతవరం: సొంత స్థలం ఉన్న 400 మందికి ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసిందని మండల ప్రత్యేకాధికారి జి.వి. లక్ష్మి తెలిపారు. గుమ్మడిగొండ, నాతవరం గ్రామాల్లో శనివారం ఆమె జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా 2,100 ఇళ్లు మంజూరు చేయగా, వాటిలో ఇంతవరకు 600పైగా నిర్మాణాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నూకరాజు హౌసింగ్ జేఈ జోగారావు, సర్పంచ్ పంచాడ పాప, వీఆర్వో సింహాచలం పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ విమర్శలు


మాట్లాడుతున్న ఎంపీటీసీ, నాయకులు

గొలుగొండ: ఏఎల్‌పురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం కావడంతోనే టీడీపీ నాయకులు ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎంపీటీసీ చింతల బుల్లిప్రసాద్, ఎస్సీ సెల్ విభాగం మండలాధ్యక్షుడు శివ, గ్రామ కమిటీ నాయకుడు నాగేశ్వరరావు ఆరోపించారు. మూడు రోజులుగా ఇక్కడ నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే తమ గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మించలేక మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు చేతులెత్తేయడంతో ఎమ్మెల్యే గణేష్ త్వరలో పనులు చేపట్టబోతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


తామరంలో మొక్కలు నాటుతున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఫారెస్ట్ అధికారి నూకరాజు

మాకవరపాలెం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తామరం ప్రాథమిక పాఠశాలలో శనివారం సర్పంచ్ గొంతిన చెల్లారత్నంతో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇళ్లు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని కోరారు. వీటి సంరక్షణ బాధ్యతా తీసుకోవాలన్నారు. తూర్పుకాపు సంఘ మండలాధ్యక్షుడు మరిబాబు, పంచాయతీ కార్యదర్శి బాలదొర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతం: పర్యావరణానికి చెట్లు ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మేడివాడ సెక్షన్ ఫారెస్ట్ అధికారి నూకరాజు అన్నారు. కొత్తకోట, దొండపూడి గ్రామాల్లో పర్యావరణ ఆవశ్యకతపై అవగాహన సదస్సులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా వాడవద్దన్నారు. భూమిపై పొరలు పొరలుగా ప్లాస్టిక్ ఉండటం వల్ల వాతావరణ సమతుల్యత కోల్పోతుందన్నారు. దీని వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. పలువురు యువకులు, పెద్దలతో పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేయించారు.

ఆయా పోస్టుకు దరఖాస్తులు

నాతవరం: లింగంపేట పంచాయతీ శివారు బుచ్చెంపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామని గొలుగొండ ఐసీడీఎస్ పీవో కె. శ్రీగౌరీ తెలిపారు. జూలై ఒకటో తేదీకి 21 ఏళ్లు నిండి, పదో తరగతి ఉత్తీర్ణత చెందిన ఎస్సీ కేటగిరీ అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు ప్రాజెక్టు కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు.

మండలాభివృద్ధికి రూ.61 లక్షల మంజూరు


జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ

రోలుగుంట: మండలంలోని పలు పంచాయతీల అభివృద్ధికి జెడ్పీటీసీ నిధులు రూ.40 లక్షలు, 15వ ఫైనాన్స్ నుంచి రూ.21 లక్షలు వెరసి రూ.61 లక్షలు మంజూరు చేసినట్టు జెడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీరమణమ్మ శనివారం తెలిపారు. బుచ్చింపేట, కుసర్లపూడి, జె.పి.అగ్రహారం, రొంగలపాలెం, నిండుగొండ, కంచుగుమల పంచాయతీల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.4 లక్షల చొప్పున, రోలుగుంటలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.3లక్షలు, కె.నాయుడుపాలెం, బి.బి.పట్నం పంచాయతీల్లో శ్మశాన వాటికలకు రూ.4 లక్షల చొప్పున, కమ్యూనిటీ హాలు నిర్మాణాలకు మునిపల్లికి రూ.4 లక్షలు, అర్ల గిరిజన పంచాయతీకి రూ.2 లక్షలు, ఎం.కె.పట్నానికి రూ. 3 లక్షలు, కొవ్వూరుకు రూ. 3 లక్షలు, రోలుగుంట శెట్టి శ్రీను పాకల వద్ద -1, కొమరవోలుకు-2, పడాలపాలెం -2, తాగునీటి బోర్లుకు రూ.5 లక్షలు, రోలుగుంటలో జీవకారుణ్య సంఘం భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, నిండుగొండలో డ్రైనేజీల నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సూచనలతో ఆయా పంచాయతీల గుర్తించిన ఈ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

ఘనంగా సీతారాముల ప్రతిష్ట మహోత్సవం


కలశ ప్రతిష్ట చేస్తున్న పురోహితులు, గ్రామస్తులు

దేవరాపల్లి: పాత వాలాబులో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఇక్కడ రామాలయంలో సీతారాముల ప్రతిష్ట మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. పురోహితుడు పాకల కామేశ్వరావు ఆధ్వర్యంలో విగ్రహాలు, కలశ ప్రతిష్టాపనను వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి సీతారాముల వారిని గిరిజనులు పెద్ద ఎత్తున దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ ఆవరణలో హోమాలను నియమ నిష్ఠలతో నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రతి ఇంటికీ తాగునీరందిస్తాం


పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ, తదితరులు

మాకవరపాలెం: ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకే జల్‌జీవన్ మిషన్ పథకం నిధులు మంజూరు చేసినట్టు ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. బూరుగుపాలెంలో రూ.30.70 లక్షలతో చేపట్టనున్న ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, పార్టీ నాయకులు భద్రాచలం, భీమిరెడ్డి గోవింద, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాజాంలో 'గడపగడపకు'

బుచ్చెయ్యపేట: రాజాం గ్రామంలో ఆది, సోమవారాలు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ మరిసా నాని తెలిపారు. రాజాం సచివాలయ పరిధి నీలకంఠాపురంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతోపాటు సంక్షేమ లబ్ధిని వివరిస్తారన్నారు. ఆయా గ్రామాల నాయకులు పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ పశు నష్టపరిహార సొమ్ము విడుదల

మాడుగుల రూరల్: మండలంలో మృతి చెందిన పశువులకు సంబంధించి వైఎస్సార్ పశు నష్టపరిహార పథకం సొమ్ము ప్రభుత్వం విడుదల చేసిందని ఏడీ వి.చిట్టినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 జూన్ నుంచి 2021 జూన్ వరకు మరణించిన పశువులకు సంబంధించి 71 మంది పాడి రైతులు బ్యాంకు ఖాతాలో రూ.20.10 లక్షలు జమ చేశారన్నారు. 2021 జూలై నుంచి అక్టోబరు మధ్య కాలంలో మరణించిన పశువులకు సంబంధించిన బీమా సొమ్ము త్వరలో జమ కానుందన్నారు.

రైతులకు వడ్డీ రాయితీ పంపిణీ

మాడుగుల: స్థానిక పీఏసీఎస్‌లో సంఘ సభ్యులకు వడ్డీ రాయితీ నగదు పర్సన్ ఇన్‌చార్జి పెరుమాళ్ల వెంకట్రావు శనివారం పంపిణీ చేశారు. 389 మంది రైతులకు 2020-21 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.8,73,305 మంజూరైంది. సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బి. శ్రీనివాసరావు, పోలిమేర చిన్నారావు, చిన్ని అచ్చిబాబు, శీలమంతుల వాసు, సీఈవో బోరా ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై బిందు, తుంపర్ల సేద్యం యూనిట్లు

నాతవరం: ప్రభుత్వం బిందు, తుంపర్ల సేద్యం యూనిట్లను రాయితీపై అందిస్తుందని సూక్ష్మ సాగు నీటి పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు జి.వి. లక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంతవరకు 1,179 హెక్టార్లలో ఏర్పాటుకు 1,320 మంది రైతులు ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి రాయితీపై యూనిట్ల మంజూరుకు కలెక్టరుకు నివేదిస్తామన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో పోలుపర్తి పార్థసారథి, జేఈలు జోగారావు, రాజేష్, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు

చోడవరం రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల చోడవరం అల్యూమ్ని వెల్ఫేర్ అసోసియేషన్ పేరిట పూర్వ విద్యార్థుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకవర్గం గౌరవాధ్యక్షుడిగా గౌరీశంకర్, ఉపాధ్యక్షుడిగా రమణమూర్తి, జాయింట్ సెక్రటరీగా కృష్ణవేణి, కోశాధికారిగా దుగ్గిరాల రవి, సభ్యులుగా భాస్కర్, ప్రభాకర్ ఎన్నికయ్యారన్నారు. 1981లో ఏర్పాటైన కళాశాల అభ్యున్నతికి పూర్వ విద్యార్థులందరూ అసోసియేషన్‌లో చేరి తోడ్పాటునందించాలని కోరారు. కళాశాలను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడానికి సలహాలు, సూచనలు అందించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రక్షణగా ఎస్‌బీఐ బీమా పథకాలు


మాట్లాడుతున్న ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ కృష్ణశర్మ

కశింకోట: ఎస్‌బీఐ ద్వారా మూడు రకాల బీమా పథకాలు కుటుంబాలకు రక్షణగా నిలుస్తాయని బ్యాంకు అమరావతి ప్రాంత జనరల్ మేనేజర్ కృష్ణ శర్మ అన్నారు. నూతలగుంటపాలెంలో యలమంచిలి ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో జన సురక్ష అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద ఏడాదికి రూ.436 ప్రీమియంతో బీమాదారుడు ఏ విధంగా మృతి చెందినా నామినీకి రూ.2 లక్షల పరిహారం అందజేస్తారని చెప్పారు. 18 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు వారికి ఇది వర్తిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ఏడాదికి రూ.20 చొప్పున చెల్లిస్తే ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబానికి రూ.2 లక్షలు పరిహారాన్ని అందిస్తారన్నారు. 18 నుంచి రూ.70 ఏళ్ల మధ్య వయసు వారికి వర్తిస్తుందని చెప్పారు. పదేళ్ల లోపు బాలికలు ఉన్న వారు సుకన్య సమృద్ధి యోజన కింద నెలకు రూ.500 నుంచి రూ. వెయ్యి వరకు చెల్లిస్తే 18 ఏళ్ల వయస్సు వచ్చేటప్పటికి 8 శాతం వడ్డీతో కలిపి మొత్తం సొమ్ము అందజేస్తామని చెప్పారు.

రుణాలు సద్వినియోగం

కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ) కింద ముద్ర, ఇతర రుణాలను అర్హులకు అందిస్తున్నామని జీఎం శర్మ తెలిపారు. బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.సురేష్‌ప్రభు మాట్లాడుతూ గ్రామాల్లో తమ శాఖలు లేనిచోట్ల కస్టమర్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత సేవలందిస్తున్నామన్నారు.